# మూగబోయిన పాట

"రండి రండి. వెల్‌కమ్. మీట్ మై ఫ్రెండ్ వెంకటరాముడు. మేమంతా వెంకట్ అని పిలుస్తాం లెండి! జెస్ట్ యే మినిట్. మీరు మాట్లాడుకుంటూ వుండండి. మొబైల్‌లో రంగనాథ్ మనుబోలు వెయిట్ చేస్తున్నాడు. యిక్కడికి రావడానికి డైరెక్షన్స్ చెప్తున్నాను" అంటూ మళ్ళీ తన చేతిలోని సెల్‌ఫోన్ ముందుకు ముఖాన్ని తరలించేశాడు శివాజీ నెమలికంటి.

"నమస్తే! నమస్కారం" అని కోరస్‌లా క్రేంకారం చేస్తూ అతిథులుగా విచ్చేసిన భార్యాభర్తలిద్దరూ ముందుకు వచ్చేశారు.

"అయామ్ విజయసారథి మొనగాల. యిక్కడే యూనివర్సిటిలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌గా వుంటున్నాను. షీ యీజ్ మై మిసెస్ లావణ్య. సైక్రియాటిస్ట్" అంటూ అతను పరిచయం గావించుకున్నాడు. మిలమిలా మెరుస్తున్న నీలిరంగు సూటు లోపల విజయసారథి గోధుమ రంగు శరీరం నిగనిగలాడిపోతోంది. దీపపు వెలుతురు అతని బట్టతలపైన పడి పరావర్తనం చెందడంతో వెంకట్ కళ్లు చిట్లించుకుంటూ చూపులు పక్కకు మళ్ళించాడు. గులాబీ రంగు పట్టుచీరను రెపరెపలాడిస్తున్న లావణ్య ఫోనులో మాట్లాడుతున్న శివాజీనలాగే భుజాలు గట్టిగా పట్టుకుని వూపేస్తూ "హాయ్! ఆఫ్టర్ యే లాంగ్ టైం!" అంటూ పలకరిస్తోంది.

"యెప్పుడొచ్చారండీ?" అని అడిగాడు విజయసారథి.

"అమెరికాకు వచ్చి రెండు వారాలయింది. యిక్కడికి యీ పొద్దు

మధ్యానమే వచ్చినాను" అన్నాడు వెంకట్ తన ముందుకొచ్చిన ట్రేలోంచీ కోక్ గ్లాసునందుకుంటూ.

సమయం సాయంత్రం యేడుగంటలు కావస్తున్నా బేస్‌మెంట్ వెంటిలేటర్ నుంచీ పల్చటి యెండ లోపలికి ప్రసరిస్తూనే వుంది. యెనిమిదడుగుల యెత్తున్న విశాలమైన బేస్‌మెంట్‌లో, గుంపులు గుంపులుగా కూర్చున్న అతిథుల మధ్య, యింకా కొన్ని కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పగటి వెలుతురు బేస్‌మెంట్‌లోకి ప్రసరిస్తున్నా ఫ్లోరసెంటు దీపాలు మాత్రం వినయంగా వెలుగుతూనే వున్నాయి. బేస్‌మెంట్‌కు వో చివరలో టేబుల్‌పైన యింకా మూతలు తెరవని సీసాలూ, హోటలు పేరు స్పష్టంగా కనిపించేలా చమ్కీ కాగితాల్ని చుట్టుకున్న పాత్రలూ కనిపిస్తున్నాయి.

"వీయస్ వడియాల యీజ్ ఆల్సో ఆన్‌దీ వే! యింకో హాఫ్‌నవర్‌లో పార్టీ బిగిన్ చేయచ్చు" అన్నాడు శివాజీ తిరిగొచ్చి కూర్చుంటూ. ఆ తర్వాత, "భవానీ, యీ కొత్త గెస్టులనోసారి గ్రీట్ చేసి వెళ్ళు" అంటూ కేకేశాడు. దూరంగా సోఫాలో మరో యిద్దరు స్త్రీల మధ్య కూర్చున్న మహిళ అలాగే వెనుదిరిగి, "హలో!" అంటూ పలకరించింది.

"నా మిసెస్‌కు వాళ్ళ బెజవాడ వాళ్ళు దొరికితే యిక మిగిలిన ప్రపంచం కనిపించదు" అన్నాడు శివాజీ నవ్వడానికి విఫల ప్రయత్నం చేస్తూ. తర్వాత "మీకు మా ఫ్రెండును డీటెయిల్డ్‌గా యింట్రడ్యూస్ చెయ్యలేదు గదా! చూడ్డానికి సూళ్ళూరుపేట నుంచో, వుదయగిరి నుంచో దారి తప్పి నెల్లూరికొచ్చిన విలేజర్‌లా కనిపిస్తున్నాడు గానీ, విజయసారథి గారూ, హీ యీజే కింగ్ మేకర్ ఆఫ్ అవర్ డిస్ట్రిక్ట్!" అన్నాడు.

"చూడ్డానికి మీ కంటే బాగా పెద్దవాడిలా కనిపిస్తున్నారీయన!" అంది లావణ్య కోక్ రుచి చూస్తూ.

"అర్లీగా బాల్డ్‌హెడ్ రావడం వల్ల అలా కనిపిస్తున్నాడు. బట్ హీ యీజ్ ఆల్సో ఫిఫ్టీ ఫోర్. యెప్పుడూ రూరల్ ప్లేసెస్‌లో ట్రావెల్ చేస్తూ వుంటాడు కాబట్టి అలా కనిపిస్తున్నాడంతే!" అన్నాడు శివాజీ అరమోడ్పు కనులతో భూతకాలంలోకి ప్రయాణం చేస్తున్నవాడిలా. "మేమిద్దరమూ ఫస్టుక్లాసు నుంచీ ఫ్రెండ్స్... మా యిద్దరిదీ వొకే స్ట్రీటు వెంకట్ వాళ్ళ బ్రదర్‌కు చిన్న సైకిల్ షాపుండేది. వాళ్ళ సిస్టర్సిద్దరికీ మా చిన్న తనంలోనే మారేజెస్ అయిపోయాయి. యింట్లో వీణ్ణి పట్టించుకునేవాళ్ళు కారు. వీడాడింది ఆట. పాడింది పాట. మా

గ్రూపుకంతా వీడే రింగులీడరు. అడ్వెంచర్లంటే వీడికెంతో క్రేజీ. వూరి చుట్టూ వుండే చెరుకు తోటల్లోకి వెళ్ళి, దొంగతనంగా గడలకు గడలే తినేసేవాళ్లం. స్కూలు యెగ్గొట్టి గోలీలూ, బొంగరాలూ ఆడేవాళ్ళం. యింట్లో వాళ్ళకు తెలియకుండా మామిడి తోటల్లోకిపారిపోయి కోతీకొమ్మా ఆడేవాళ్ళం. సాయంకాలాల్లో కొండల్లో వుప్పరపట్లెలు కాసేవాళ్ళం. ఆదివారాల్లో కీనేరు బావుల్లో స్విమ్ చేసేవాళ్ళం. యెందుకు చెప్తారు లెండి. అదొక గోల్డెన్ పీరియడ్."

మరో కొత్త భార్యాభర్తల జంట బేస్మెంట్లోకి రావడంతో శివాజీ తన ప్రసంగాన్ని కాసేపు ఆపక తప్పలేదు. ఐ.టీ యింజనీర్లుగా పనిచేస్తున్న ఆ యువజంటను ముక్తసరిగా పరిచయం చేసిన తర్వాత, అతను మళ్ళీ తన చిన్ననాటి అనుభవాల్ని నెమరువేసుకోసాగాడు.

"యెంతో హాపీగా బతికాం మేమప్పుడు. మా వూరి యేటి నీళ్లంత స్వీట్గా, మా మామిడి తోటలో యెగిరే చిలకలంత ఫ్రీగా, మేమాడుకునే గాలిపటాలంత బోల్డ్గా, వర్రీ అంటే యేమో తెలియకుండా పెరిగాం మేము. మా ఫాదరు టీచరుగావడంతో యెప్పుడూ చదవమని ప్రాణం తోడేసేవాడు. అయితే, మా వెంకట్కు అలాంటి రిస్ట్రిక్షన్లేవీ వుండేవి గావు. నేను మా ఫాదరెన్ని పనిష్మెంట్లిచ్చినా భయపడకుండా వెంకట్తో షికార్లు చేసేవాణ్ణి. ఫస్టుటైం నాకు సిగరెట్టు రుచి చూపించినవాడు వెంకటే! ఫస్టు టైం నా చేత లవ్లెటరు రాయించినవాడు గూడా వీడే! నేను రెడ్హేండెడ్గా టీచరుకు దొరికిపోయి నప్పుడు, తెలివిగా తప్పించుకున్నది గూడా వీడే. అంతెందుకు? యెస్సెస్సీలో నేను పాసయినప్పుడు బోరుమని యేడ్చేశాను. వీడు ఫెయిలయ్యాడని నా బాధ. వీడు లేకుండా కాలేజీకెళ్ళడం కంటే ట్రాజెడీ యేముంటుంది?"

"మీరేం బిజినెస్ చేస్తుంటారు?" అంటూ అడ్డు తగిలాడు విజయసారథి.

"నేను... మరి?" అన్నాడు వెంకట్ పెదవులు కదిలిస్తూ.

"వీడేం బిజినెస్ చేయడు అని అడిగితే రిలెవెంట్గా వుంటుంది" అన్నాడు శివాజీ తన సమాధానాన్ని మరికొంత సాగదీస్తూ. "మా డిస్ట్రిక్ట్లో యెస్వీ సుగర్స్ అంటే పెద్ద పేరు. అది వీడిదే. వెంకట్ డిస్టలరీస్ పేరు విన్నారా మీరు? దాని మేనేజింగ్ డైరెక్టరు వీడే! ఆ మధ్య పెద్ద కాలవ ప్రాజెక్టను గురించి యింటర్నెట్లో పెద్ద ఐటం వచ్చింది. దాని కాంట్రాక్టు వీడిదే. ఆ పనులన్నీ నిజానికి మావాడి యేజెంట్లూ, అసిస్టెంట్లూ చూసుకుంటారు. వీడు యెప్పుడూ

పాలిటిక్సులో బిజీగా వుంటాడు..."

"మీరు యెమ్మెల్యేనా? యెంపీనా?" అని అడిగింది లావణ్య.

"నేను... రెండు తడవలు... యెలక్షన్లు..." అన్న పొడి పొడి మాటలు వెంకట్ నుంచీ వెలువడ్డాయి.

"లాస్ట్ టైం మా కాన్స్టిట్యుయెన్సీని యెస్సీకి అలాట్ చేశారు. మా వెంకట్ పైన గ్రెడ్జితో హైకమాండ్ ఆపని చేయించిందని పెద్ద రూమరుంది. అయినా, మా వాడు నిలబెట్టిన యెస్సీనే యెమ్మెల్యే అయ్యాడు. మా వాడి ముందు కూర్చోమన్నా కూర్చోడు అతను. పవర్లో వుండే యెమ్మెల్యేలకూ, అపోజిషన్ వాళ్ళకూ మన మహాసభల నుంచీ యిన్విటేషన్స్ పోతాయి. వాళ్ళంతా యెలెక్షన్లప్పుడు ఫారిన్‌కు వెళ్ళొచ్చామని డబ్బాలు కొట్టుకుంటున్నారట. మావాడేనా తీసి పోయింది? సీయస్సీ ఫౌండేషన్ వాళ్ళు మా వాడికి బాగా తెలుసు. వాళ్ళే యిప్పుడు యిన్వయిట్ చేశారు. డెట్రాయిట్‌లో వారం వున్నాడు. యిక్కడ మరో వారం. యిక్కడి నుంచీ డల్లాస్... అదీ ప్రోగ్రాం" అన్నాడు శివాజీ.

"యెలాగూ యింత దూరం వచ్చారు. మీ మిసెస్‌ను గూడా తీసుకు రాగూడదూ మీరు?" అని ప్రశ్నించింది లావణ్య.

"నా భార్యకు యింటి బయటకు రావాలంటే యిష్టం వుండదు." చాలాసేపటి తర్వాత రెండు మాటలు మాటాడేసరికి వెంకట్ గొంతు కీచుమంది. "భలే మొగమాటం. పైగా యింట్లో చానా పని..."

"మా వైపు పెద్ద పెద్ద లీడర్ల వైపులంతా ఘోషాలో వుంటారు సార్! అనవసరంగా అసలు బయటకు రారు. అదొక దర్జా." దూరంగా కూర్చున్న భార్య చెవిలో పడడం కోసమన్నట్టుగా బిగ్గరగా అరిచాడు శివాజీ.

"మీ ఫాదరు చిన్న మర్చెంటేనన్నారు. మరింత పెద్ద యెస్టేటెలా మీరు బిల్డప్ చేశారు?" అని కుతూహలంగా ప్రశ్నించాడు విజయసారథి.

"యిండస్ట్రీ అండీ! దేరీజ్ నో ఆల్టర్‌నేటివ్ టు యిట్. మా వాడు సెల్ఫ్‌మేడ్ మాన్." మళ్ళీ శివాజీ దగ్గరి నుంచే సమాధానం వచ్చింది. "యెస్సెల్సీ తర్వాత నేనేమో కాలేజీలకూ, యూనివర్సిటీలకూ యిమిగ్రేట్ అయ్యాను. మా వాడు వూర్లోనే వుండిపోయాడు. టూ యియర్స్ బ్యాక్ అంటే దాదాపు తర్టీ యియర్స్ తర్వాత నేను యిండియాకెళ్ళాను. అప్పుడు తెలిసింది. యీ గేప్‌లో మావాడు బాగా నేమ్ అండ్ ఫేమ్ సంపాదించాడని. అప్పుడు మావాడు నా కోసం అరేంజ్

చేసిన పార్టీ గురించి చెప్పాలంటే నా దగ్గర మాటల్లేవు."

కళ్ళెగరేసి అదోలా నవ్వుతూ, "మా ఫ్రెండొకడు అమెరికాలో పెద్ద ప్రొఫెసరంటే నాకు గూడా యెంత గొప్ప! చెప్పాచెయ్యకుండా ధఢీమని వచ్చేసినాడు గానీ, ముందుగా తెలిసుంటే యింకా పెద్ద గ్రాండ్ పార్టీ యిచ్చుందును" అన్నాడు వెంకట్.

"అయితే, మీ బేసిక్ ప్రొఫెషనేమీ లేదా?" అని మళ్ళీ పాత ప్రశ్ననే సంధించాడు విజయసారథి.

"మా శివాజీ చెప్పినాడు గదా! అన్ని రకాల పనులూ చేసినాను." కొత్త వాతావరణానికి కొద్దిగా అలవాటు పడడంతో వెంకట్ సాఫీగా మాట్లాడసాగాడు. "యిదంతా వొక దినంతో జరిగిన పని గాదు. పెద్దపెద్దోళ్ళ అడుగులకు మడుగులొత్తాల. కొండ మీద కోతినైనా తెచ్చియ్యాల. రాజుల్తో కొలువూ, దొంగలతో వొలువూ చెయ్యాల. అయినవాళ్ళకు ఆకుల్లో, కానివాళ్ళకు కంచాల్లో వడ్డించాల."

"యిండియాలో పాలిటిక్స్ గూడా బిజినస్సే నంటారు గదా!" అంది లావణ్య ముఖం చిట్లించుకుంటూ.

"మీరు ప్రాఫిట్టే చూస్తున్నారు. దాని వెనకుండే యిండస్ట్రీని చూడడం లేదు" అంటూ శివాజీ తన స్నేహితుడికేసి మెచ్చికోలుగా దోరదోర చూపుల్ని సరఫరా చేశాడు. "లాస్ట్ టైం నేను మా వూర్లో కంప్లీట్‌గా ట్వెంటీఫోర్ అవర్స్ వున్నాను. అప్పుడంతా కేర్‌ఫుల్‌గా గమనించాను. మునుపుండే పాత పెంకుటింటి ప్లేస్‌లో యిప్పుడు వెంకట్ పెద్దపాలెస్ కట్టాడు. దాన్ని చూస్తే చాలు, మా వాడెంత కనాయిజరో తెలిసిపోతుంది. మేమెళ్ళేసరికి యింట్లో పెద్ద గ్రూప్ వెయిట్ చేస్తోంది. యేదో రియల్ యెస్టేట్ గొడవ. మా వాడు యింటర్‌ఫియర్ గాకపోతే అది తెగదని వాళ్ళ నమ్మకం. లంచ్ తర్వాత యెవరో మినిస్టరు గారితో మీటింగు. అసలింతకూ ఆరోజు కాపిటల్లో వుండాల్సినవాడు. నాకోసమని ఆ యెంగేజ్‌మెంటు పోస్టుపోన్ చేసుకున్నాడు."

"మీకు అమెరికా నచ్చిందా?" అని అడిగాడు విజయసారథి.

"బాగుంది. అంతా క్లీన్‌గా వుంది. అయితే, జనాలు బాగా తక్కువ. గుంపులు గుంపులుగా జనం కనబడకపోతే నాలాంటోడికి జంకుగా వుంటాంది" అన్నాడు వెంకట్.

"జంకెందుకు? భలేవారే మీరు?" విస్తుపోయింది లావణ్య.

"యింతకూ నేను మా వూరు వెళ్ళడానికుండే రెండు ముఖ్యమైన రీజన్సు విననేలేదు మీరు" అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించాడు శివాజీ. "వొకటి, మా వూరి డబ్బారేకుల సినిమా టాకీసులో జానపద సినిమా చూడాలని నా కోరిక. మా చిన్నతనంలో సాయంత్రం నుంచీ గ్రామ్‌ఫోన్ రికార్డులతో వూరించీ వూరించీ, మా టెన్షను రైజ్ చేసిన తర్వాత, రాత్రి యెయిట్వోక్లాక్ పైన మా టాకీసులో ప్రొజెక్టరు ఆనయ్యేది. బాగా వోల్డయిపోయి, పాచెస్‌తో కనిపించే మా టాకీస్ స్క్రీనుకు వెండితెర అనే పేరు సరిపోదు. సినిమాలోని కారెక్టర్ల మాటలకంటే, బాక్‌గ్రౌండు మ్యూజిక్ కంటే, ప్రొజెక్టరు సౌండే పెద్దగా వినబడేది. వొకేవొక ప్రొజెక్టరు గావడంతో అక్కడ మాకు నాలుగు యింటెర్వెల్సు వుండేవి. అయితే, మా డొక్కు ప్రొజెక్టరుకుండే టైం సెన్సు యింకా గొప్పది. ఆడియన్సంతా సస్పెన్సును భరించలేక వూపిరి బిగబట్టుకుని చూస్తున్న సమయంలో సడన్‌గా ఫిలిం తెగిపోయేది. ఆ పైన ఆ సినిమా యెప్పుడు బిగినవుతుందో యెవరూ చెప్పలేరు. నేల టికెట్టు కొనుక్కుని, మనుషుల మధ్య యిరుక్కుని, బీడీ పొగల్ని యెంజాయ్ చేస్తూ ఆ ప్రొజెక్టర్ చేసే స్పెషల్ యెఫెక్టులతో సినిమా చూడడం కంటే గొప్ప యెక్స్‌పీరియన్స్ నాకింతవరకూ దొరకలేదు. అక్కడ మళ్ళీ సినిమా చూడాలని నాకెన్నాళ్ళ నుంచో కోరిక. యిక నా రెండో విష్ యేమిటంటే..."

శ్రోతల్లో వుత్సుకతను రేకెత్తించడం కోసమన్నట్టుగా రెండు నిమిషాలాగి, ఆ తరువాత, "మా వెంకట్ పాడే పాట వినడం" అని ముక్తాయించాడు శివాజీ.

"మీ ఫ్రెండు పెద్ద సింగరా?" విజయసారథి కుతూహలంగా ప్రశ్నించాడు.

"మీరు బాగా పాడతారా?" అంటూ లావణ్య గూడా ఆసక్తితో అడిగింది.

"యింకా డౌటేనా? మా వెంకట్ గొంతు మా టాకీస్ ప్రొజెక్టరుకేమీ తీసిపోదు. కేవలం పాటలోని మాటల్ని మాత్రమే పాడాలనే రూలు వీడికుండేది గాదు. మా వూరికప్పుడే వచ్చిన పాత సినిమా పాటలంటేనే మావాడికిష్టం. పాటలో లిటరేచర్ మరచిపోయినప్పుడు ఆ ప్లేసులో కొత్త కొత్త మాటలు యిరికించడంలోనూ, మాటలు స్ట్రయిక్‌గానప్పుడు కొత్త కొత్త సౌండ్లు క్రియేట్ చెయ్యడంలోనూ వీడు యెక్స్‌పర్ట్. సాంగులో మీనింగు పోతోందని గానీ, స్వరాలు అపభ్రంశమవుతున్నాయని గానీ మీరు కంప్లయింటు చేయొచ్చు. కానీ, వాడి పాటకాహద్దులే వుండవు. ఫ్రీబర్డ్ మాదిరి యిష్టం వచ్చినట్టుగా, కొండల్లో పుట్టే స్ప్రింగ్ వాటరంత క్లియర్‌గా, బౌండరీలే లేకుండా పరిగెత్తే వాడి పాటకూ, మా

వూరి సినిమాకూ వొకటే డిఫరెన్సు. సినిమా రాత్రి తీ హవర్సు మాత్రమే! మావాడి పాటకు బిగినింగూ, యెండింగూ వుండవు. అది యెండ్లెస్ అండ్ యెటర్నల్! మార్నింగ్ స్నానం చేసేటప్పుడు బాత్రూంలో అది జలతరంగిణి. స్కూలుకు వెళ్ళేటప్పుడు దారి పొడవునా అది మార్చింగ్ సాంగ్. క్లాసులో టీచరు చెప్పే పాఠానికి వాడి పాటే బాక్‌గ్రౌండ్ మ్యూజిక్. ఆ రోజుల్లో మా వెంకట్ కూర్చుంటే పాట, నిలబడితే పాట! వెంకట్ అంటేనే పాట. పాట అంటేనే వెంకట్..."

"తెలుగుపాట విని చాలా రోజులైంది. వొక పాట పాడండి!" అంటూ విజయసారధి ప్రాథేయపడసాగాడు.

"యెంత పాతదైతే నాకంత యిష్టం. మీ పాటకు అకంపానిమెంటు కావాలంటే చెప్పండి. యిక్కడెక్కడో సుందర్ జోగుల వున్నాడు. అతనైతే టేబుల్నే డ్రమ్ముగా మార్చేయగలడు" అంది లావణ్య చుట్టూ పరికిస్తూ.

"అదంత సులభంగా కుదిరేపని గాదు" అన్నాడు శివాజీ ముఖంలో మరింత వుద్వేగం తొంగి చూస్తుండగా. "ఆ రాత్రికెలాగైనా సినిమాకెళ్ళాలను కున్నాను నేను. పార్టీ తరువాత వెళ్దాం అన్నాడు వీడు. వచ్చిన గెస్టులంతా యేవో అబ్లిగేషన్స్‌తో మావాణ్ణి వుక్కిరిబిక్కిరి చేసేవాళ్ళే! యెవరికో మావాడు అప్పులిచ్చాడట. ఆ అప్పు తీర్చలేకపోగా, ఆ రైతులు మావాణ్ణే ఆ భూముల్ని కొనుక్కోమంటారు. యింకెవడో కాలేజీ పెట్టుకోవడానికి రెకమండేషను చెయ్యమంటాడు. మరొకడు యేకంగా సీయం పేషీతో చెప్పి యన్‌యమ్మార్ పోస్టయినా యిప్పించమంటాడు. రాత్రి యెయిట్ తర్వాత మేం సినిమాకు వెళ్ళాం. అక్కడ పాత టూరింగు టాకీసుకు బదులుగా కొత్త థియేటర్ కనిపించింది. దాని వోనరు మావాడికి ఫాలోయరేనట! ప్రాజెక్టర్ పక్కన స్పెషల్ సీట్లపైన కూచోబెట్టాడు. అప్పటికి యింటర్వెల్ కూడా అయిపోయిందట. తెరపైకి చూడసాగాను. అక్కడ నాకు కావలసిన మెజీషియన్ లేడు. జెర్కిన్‌లు తొడుక్కున్న హీరో చేతిలో, స్టెన్ గన్ మెరుస్తోంది. రాజకుమార్తెను మెజీషియన్ పారెట్‌గా మార్చడం లేదు. హీరోయిన్ విలన్‌తో కలిసి డ్యూయట్ పాడుతోంది. కీలుగుర్రం పైన ప్రిన్స్ యెగరడం లేదు. బట్టల్ని పొదుపు చేస్తూ అమ్మాయిలెవరో డాన్సు చేస్తున్నారు. పక్కకు తిరిగి చూశాను. సీట్లో వెంకట్ కూడా లేడు. స్క్రీన్ పైన మెజీషియనూ, పక్క సీట్లో వెంకట్ లేకపోయేసరికి సినిమా గూడా నాకు నచ్చలేదు. బయటికొచ్చేసరికి థియేటర్ ఆఫీసు రూమ్‌లో డ్రింక్ తాగుతూ కనిపించాడు వెంకట్. థియేటర్ వోనర్ పెద్ద నోట్లకట్ట

అతడికిస్తున్నాడు. హైదరాబాద్‌లో అతడికేదో పనుందట. చేసిపెట్టమని యిక్కడ కూడా ఆబ్లిగేషను. పబ్లిక్ ఫిగరైన తర్వాత అప్పుడప్పుడు సొంత డబ్బును గూడా వాళ్ళకోసం స్పెండ్ చేయాల్సిందేనన్నాడు వెంకట్. చూడబోతే మావాడి చేతిలోనే పెద్ద మంత్రదండం వున్నట్టనిపించింది.''

"యెంతకూ మీరు మాట్లాడ్డమేనా? గెస్ట్ మాట్లాడితే విందామని వచ్చారు వీళ్ళందరూ" అని రుసరుసలాడుతూ దగ్గరికొచ్చింది భవానీ.

"ఆ ప్రోగ్రాం గూడా వుందిలే! యింకా కొందరు గెస్టులు రావాలి. యిండియన్ వీక్లీ యెడిటర్ని గూడా రమ్మన్నాను, కవరేజీ కోసం" అన్నాడు శివాజీ. వచ్చినంత వేగంగానే భవానీ మరో గుంపు దగ్గరికి వెళ్ళిపోయింది.

"యీలోగా మీరో పాట పాడండి సార్" అంది లావణ్య. వెంకట్ గ్రుక్కిళ్ళు మింగసాగాడు.

"చూశారా! మావాడు పాడడం మానేసి చాలా రోజులైపోయింది. అంతెందుకు? ఆ రోజు రాత్రి భోజనం చేసిన తర్వాత పాట పాడమని మావాణ్ణి కాళ్ళా వేళ్ళా పడ్డాను. 'మా ఆయనేమిటి? పాట పాడ్డమేమిటి!' అని మావాడి మిసెస్ నోరు తెరిచేసింది. చిన్నప్పుడు వెంకట్ బలే పాడేవాడంటే వాడి భార్యే నమ్మలేదు. వీడికిద్దరు కొడుకులు. యిద్దరూ పాలిటిక్సులోకే దిగేశారులెండి! వాళ్ళ నాన్నకు వాళ్ళే పెద్ద ఆర్మీ! వాళ్ళు గూడా వాళ్ళ నాన్న బాత్రూంలోనైనా హమ్ చెయ్యగా వినలేదన్నారు. 'పోనీ యిప్పుడో పాట పాడరాదా?' అని వెంకట్‌నడిగాను. అతను వులకలేదు, పలకలేదు. కూర్చునే గురకలు తీస్తున్నాడు. 'ఆయనెప్పుడూ యింతేనండీ! క్షణం వేస్టు చెయ్యరు' అంది వీడి భార్య. నిజమే మరి! మళ్ళీ నిద్ర లేచేసరికి బోలెడన్ని పనులు యెదురుచూస్తూ వుంటాయి గదా!''

డబ్బా రేకుల పైన రాళ్ళు దొర్లుతున్నట్టుగా పెద్దగా శబ్దంగా చేస్తూ వెంకట్ ఆవులించాడు. అందరూ విస్తుపోతూ అతడికేసి తిరిగి చూశారు.

"చూశారా! పాట మాటెత్తితే మా వెంకట్ కిప్పుడు గూడా నిద్ర ముంచుకొస్తోంది. మావాడి పాట వినాలంటే మీరు గూడా టైం మిషనెక్కి పాస్టులోకెళ్ళాల్సిందే! యిప్పటికే లేటయిపోయింది. అందరు గెస్టులూ వచ్చేసినట్టే గదా. యిక మనం పార్టీ బిగిన్ చేద్దాం" అంటూ ప్రకటించేశాడు శివాజీ.

2

దూర దూరంగా బొమ్మరిండ్ల మాదిరి ముచ్చటైన యిండ్లు. వాటి చుట్టూ పచ్చగా గడ్డి బయళ్ళు. ప్రతి యింటి ముందరా సక్కంగా పెరిగిన పూలచెట్లు. గడ్డి బయళ్ళ మధ్యలో తెల్లంగా మెరిసిపోయే సిమెంటు రోడ్డు. యిండ్ల లోపల మనుషుల పొలకవ అగుపడ్డం లేదు. రోడ్లపైన గూడా నరపురుగు తిరుగాడ్డం లేదు. కుక్కలూ, పిల్లులూ అయినా యీ దేశంలో వుండాయో, లేదో నాకు తెలవడం లేదు.

దూరంగా ఆకాశంలో మాత్రం చిన్న చిన్న చుక్కల మాదిరిగా విమానాలు పోతా వుండేది కనబడతానే వుండాది. చుట్టుపక్కల పక్షులు గూడా యెగరాడ్డం లేదు. ఫోటోను జూసినట్టుగా యెంతసేపు చూసినా అదే దృశ్యం. మార్పేలేదు. యెంతసేపని చూసేది? బలే విసుగ్గా వుండాది.

సినిమాల్లో సెట్టింగుల మాదిరి యిల్లు గూడా జబర్దస్తీగా వుండాది. కూర్చుంటే నలిగిపోతాయనిపించే సోపాలు, నడిస్తే మాసిపోతాయనిపించే కార్పెట్లూ, ఆఖరికి బాత్రూముల్లో గూడా ఫ్లవరువాజులు. అంతా బాగనే వుండాది. అయినా, యీ మాదిరి వొంటిగా అగోరించాలంటే మాత్రం యెవుడివల్ల కుదిరితింది?

కాయం అమెరికాలో వుండాది గానీ, నా మనసు మాత్రం మా వూర్లోనే తిరగాడతా వుండాది. వాటర్ షెడ్డు యెలక్షన్లకు నోటిఫికేషను యిచ్చేసినారేమో! పార్టీ మెంబరుషిప్పు క్యాంపయిను మొదులుబెట్టేసినారేమో! ముందుగా గమనించుకోకపోతే బందార్లపల్లె రోడ్డు కాంట్రాక్టును వేరేవాళ్ళు తన్నుకోనిపోతారేమో! జిల్లా పార్టీ సెకరట్రీ పోస్టు నాదేనని హైకమాండు ముద్దరేసేసింది. నేను లేనిది చూసి యెవుడైనా చక్రం అడ్డమేస్తాడేమో! యెన్ని పనులు? యెంత ఆదాయం లాసు? అప్పుటికీ దినమ్మూ ఫోన్లమీద అందర్నీ అదరగొడతా వుండాను. అయినా, దగ్గిర మనిషుండేదానికి సమానం లేదు గదా!

న్యూయార్క్‌లో పోయిన ఆదివారం నుంచీ యిదే మాదిరిగా వొంటిగా కొంపకు కాపలా గాస్తా వుండాను. పొద్దన్నెప్పుడో ఆఫీసుకు పోతే యీ మొగుడూ పెండ్లాలు యింటికి తిరిగొచ్చేది రాత్రికే! అప్పుటికీ నా కోసరమని శివాజీ సోమవారం సాయంత్రానికంతా యింటికొచ్చేసినాడు.

యింతలోకి యేదో కొత్త ప్రోగ్రామొచ్చిందంట. ఆ మర్నాటి నుంచీ లేటుగానే వస్తా వుండాడు. ఆస్పత్రిలో డ్యూటీ అయిపోయినాక భవానీకి దినమ్మూ యేదో కౌన్సిలింగుంటిందంట! రోజూ లేటుగా రావడం, నాకు క్షమాపణలు చెప్పడం...

అట్లా జరగతా వుంది కథ.

యీ మొగుడూ పెండ్లాలు సాయంత్రం యింటికి తొందరగా తిరిగొచ్చినా లాభమేమీ వుండదని నాకెప్పుడో అర్థమయిపోయింది. అదేం మనుషులో, వచ్చినప్పటి నుంచీ చూస్తానే వుండాను. వొక మంచి మాట మాటాడుకోరు, సరాగం లేదు. యెప్పుడు వొకర్ని చూస్తే యింకొకరు ముఖం మొటమొటలా డించుకుంటా వుంటారు. ఆఫీసుల నుంచీ వచ్చీ రాంగానే రెండు బ్రెడ్డు ముక్కలు మింగేసి యిద్దురూ వేరే వేరే బెడ్డురూముల్లోకి దూరేస్తారు.

తెల్లారి యెవురి పాటుకు వాళ్ళు వేరే వేరే కారుల్లో ఆఫీసులకు పోతారు. కావలసిన వస్తువులూ, సౌకర్యాలూ అన్నీ వుండాయింట్లో. అయినా, యెప్పుడూ యేందో పోగొట్టుకున్నోళ్ళ మాదిరి ముఖాలు వేలాడేసుకునే వుంటారు. ఆ రోజు పార్టీకొచ్చిన వాళ్ళు గూడా యిదేరకంగా కనిపించినారు. వీళ్ళందురూ యేం పోగొట్టుకున్నారో!

ఫ్రిజ్జుల్లో గిన్నెల నిండా అన్నమూ, కూరలూ వుండాయి. కావాలంటే మైక్రోవోవెన్‌లో పెట్టి వేడి చేసుకోమన్నారు. ఆ వేడి చేసుకోడాలూ, తిన్నాక యెంగిలి గిన్నెలు కడగడాలు... నేనీ పనులు చేసినానని తెలిస్తే వూళ్ళో మావాళ్ళు నవ్వుకోరా? అంతా నామర్దా బతుకైపోయింది. ఆకిలయినప్పుడు తినక తప్పదు గదా? అందుకే తినడం, ఆ తర్వాత కడగడం... పోతేపోనీలే, ఆ పనయినా వుంది. లేకపోతే యిక్కడ పొద్దెట్ల పోతింది? యీ ఫస్టుక్లాసు జైలు పనిష్మెంటు కోసరం అమెరికా దాకా రావాల్నా?

నాకొచ్చిన వక్కరముక్కర యింగ్లీషుతో డైలీ పేపరు చదవదామని ట్రైజేసినాను. యీ వూర్లో పేపర్లు చానా చప్పగా యేడిసినాయి. మర్డర్లూ, స్కాములూ, అభియోగాలూ, కమీషన్లూ యేమీ వుండవీ పేపర్లలో. అసలీ వూళ్ళో మనుషులకు క్రికెట్టనే మాట గూడా తెలిసినట్టు లేదు. అందుకే దిన వారీ పేపర్లు యిండ్ల గడపల ముందు నుంచీ అట్లనే కుప్పతొట్లల్లోకి పోతా వుంటాయి. శివాజీ టీవీ ఆన్ చేసేదీ, చానల్లు మార్చేదీ నేర్పించినాడు. ఆ టీవిల్లో వచ్చే ప్రోగ్రాములు నాకేమీ కాబట్టలేదు. పొద్దు తోసేది గగనంగా వుంది. యెప్పుడూ రకరకాల పనులతో టెన్షన్‌గా బతికేదానికి అలవాటైపోయింది. యీ మాదిరిగా వూరికే తినేసి తిరగాలంటే పిచ్చి పట్టినట్టుండాది. నా వొళ్ళు నామెక్కిన గొడ్డుమాదిరయిపోయింది.

యింట్లోనే గింగిరాలు తిరిగినాను. లాభం లేదు. యేం చేసేది? టీవీ

పక్కనుండే డ్రా తెరచినాను. లోపల యేవేవో సినిమాల సీడీలు కనిపించినాయి. పైనుండే పేర్లు చదవతా అన్నీ తిప్పినాను. కింద కొన్ని పాత తెలుగు జానపద సినిమాల సీడీలు కనిపించాయి. అన్నీ నేను చిన్నప్పుడెప్పుడో చూసిన సినిమాలు. వొకటి తీసి సీడీ ప్లేయర్లో పెట్టి ఆన్ చేసినాను.

యింత తీరిగ్గా సినిమా చూసి యెన్నో యేండ్లయి పోయింది. సినిమాలో తెలుగు మాట వినబడేసరికి ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది. మాయల మాంత్రికుడు తెరపైకొచ్చినాడు. యింతలో పాటలు గూడా వచ్చేసినాయి. నవ్వతా తుళ్ళతా సినిమాలో లీనమై పోయినాను. శుభం కార్డు వచ్చినాక గానీ నేను అమెరికాలో వుండాననే సంగతి గుర్తుకు రాలేదు. ఫ్రిజ్జులోంచీ ఆపిలు పండు తీసుకుని తింటా కూని రాగం తీయడం మొదులు పెట్టినాను. యింట్లో యెవురూ లేరుగదా! యింకొంచెం పెద్దగా పాడసాగినాను.

ఆ పొద్దు పార్టీలో శివాజీ నా పాటను పెద్దగా పొగిడినాడు. నిజంగా చిన్నప్పుడు నేనంత బాగా పాడేవాణ్ణా? యేమో! యీ పాలిటిక్సులోకి దిగినాక సినిమాలూ, పాటలూ అన్నీ చుట్టిపెట్టేసినాను గదా! అంత బిడువెక్కడుండాది నాకు? యిప్పుడు కొంచెం తీరిక దొరకతానే పాత పాట బయటికొచ్చేస్తా వుంది. యీ పాటలూ, రాతలూ, కోతలూ దేనికి పనికొస్తాయి? చదువునే నమ్ముకోనుంటే, మహా అయితే యీ శివాజీ మాదిరి బతికుంటాను. అంతేగదా! నేను సంపాదించిన దాంట్లో యిదేమూలలకు సరిపోతుంది? మిషన్ల మాదిరి పనిజెయ్యటం, యింటికొచ్చి తినటం, గిన్నెలు కడుక్కోడం - అంతేగదా? అందుకే వీళ్ళకు పాటలూ, పుస్తకాలూ అంటే బలే బ్రమ. యెవుడి పిచ్చివాడి కానందం అంటారందుకే! నాలో నేను నవ్వుకుంటా పాటను పాడుకోసాగినాను. అయినా, చిన్నప్పుడు పాడినంత బాగా యిప్పుడు గూడా పాడలేనా? యేమో! ఆ సంగతి శివాజీని అడిగి తెల్సుకోవలసిందేనేమో!

3

దృష్టిని రోడ్డుపై నుంచీ కాస్త పక్కకు తిప్పుతూ "నిన్న మీ ట్రిప్ యెలా జరిగింది" అని ప్రశ్నించాడు శివాజీ. "బాగా జరిగింది" అన్నాడు వెంకట్.

ముందు సీట్లో శివాజీ పక్కన కూర్చున్న భవానీ వులకలేదు, పలకలేదు.

రెండు వైపులా ఆడవిలా పెరిగిన వృక్షాల మధ్య, చారలు చారలుగా సాగుతున్న రోడ్డుపైన, జారే మంచు బిందువులా జోరుగా పరిగెడుతోంది కారు. రెండు వైపులా ట్రాక్‌లలో అక్కడక్కడా కార్లూ, ట్రక్కులూ వేగంగా

సాగిపోతున్నాయి. రోడ్డు కిరువైపులా రకరకాల సైను బోర్డులు బరాబరులు పలుకుతున్నాయి. బయట యెండ కాస్తున్నా, కారు లోపల యేసీ చలికాలాన్ని సృష్టిస్తోంది.

"మేన్‌హాటన్ డౌన్ సిటీలో నేనైతే దారి తప్పిపోతాను. మా భవానీకా ప్రాంతమంతా బాగా తెలుసు. అందుకే గెస్టులెవరొచ్చినా సైట్ సీయింగ్ చేయించే డ్యూటీ ఆమెపైన్నే పడుతుంది. షీ ఆల్సో యెంజాయ్స్ యిట్. ఆమె కంటే మంచి హోస్టు గానీ, కుక్కు గానీ నాకు తెలియదు" అన్నాడు శివాజీ భార్యకేసి తల తిప్పి చూస్తూ.

యీ సారి గూడా భవానీ ముఖంలో నిర్లిప్తతే తొంగిచూసింది. "నీ భార్యకు వోపికెక్కువ శివాజీ. లిబర్టీ స్టాచ్యూ, యెల్లిస్ ఐలాండ్, మ్యూజియం, సబ్‌వే, యెంపయిర్ స్టేట్ బిల్డింగ్, డబ్ల్యుటీవో పడిపోయిన తావూ - అన్నీ యిలావరిగా తిప్పి చూపించింది" అని చెప్పాడు వెంకట్.

"భవానీ లేకుంటే యింట్లో నేనేమీ చేసుకోలేను వెంకట్! యింటి పనులూ, నా పనులూ అన్నీ ఆమె పేషన్స్‌తో చేసుకుపోతుంది" అంటూ మళ్ళీ భార్యను మెచ్చుకున్నాడు శివాజీ. భవానీ కిటికీ వైపుకు ముఖం తిప్పుకుంది.

పట్టపగలే దీపాలు వెలిగించుకుని వస్తున్న కారును చూపెడుతూ, "అది పెట్రోలింగు కారు. రోడ్డు రూల్సుఫాలో గాకపోతే పోలీసు టికెట్టిచ్చేస్తాడు" అన్నాడు శివాజీ.

"యింకా యెంత దూరం వుంది?" అని అడిగాడు వెంకట్.

"యింకో ఫిఫ్టీ మైల్స్. అర గంటలో అక్కడుంటాం. నిన్నంతా కంపెనీ యివ్వలేదు గదా! కనీసం అట్లాంటిక్ సిటీకయినా నీతో వద్దామని యీ ప్రోగ్రాం యీ రోజుకు షెడ్యూల్ చేశాను" అన్నాడు శివాజీ.

"అట్లాంటిక్‌కయితే శివాజీ యెప్పుడూ రెడీగానే వుంటాడులెండి" అంది భవానీ కత్తితో నరికినంత చురుగ్గా.

ఆవిడ ముఖంలో చిడుముడిపాటును గమనించి తత్తరపడిపోతూ, "అట్లాంటిక్ సీటీ అంటే నీకంత యిష్టమా శివాజీ?" అని ప్రశ్నించాడు వెంకట్.

"డాలర్లు కనిపించే చోట్లన్నీ శివాజీ కిష్టమే" అందామె.

"డబ్బుంటే యెవరికిష్టం వుండదు?" అని నవ్వబోయాడు శివాజీ. ఆ నవ్వు తనకే కృత్రిమంగా కనిపించడంతో కంగారు పడిపోతూ, "యీ వీకెండ్‌లో మేం చికాగోకెళ్ళాల్సింది. మా డాటరు అక్కడే వుంటోంది... వచ్చే వీకెండుకెళ్దాంలే

భవానీ'' అన్నాడు, యిద్దరు వ్యక్తులతోనూ వొకేసారి మాట్లాడడానికి ప్రయత్నిస్తూ.

"వచ్చే వీకెండ్ న్యూ జెర్సీకెళ్ళాలి!" గోడకేసి విసిరిన బంతిలా భవానీ సమాధానం వేగంగా తిరిగొచ్చింది.

"న్యూ జెర్సీలో మా శ్యాం - అదే మా 'సన్' వున్నాడు. గ్యాస్ట్రో యెంట్రాలజీలో యెం.డి. యీ మధ్యే యేదో ట్రెయినింగుకు పారిస్‌కు మూడు నెలలు వెళ్ళొచ్చాడు. వచ్చి త్రీ వీక్సయింది. మేమింకా చూడలేదు." సంజాయిషీలా చెప్పుకుపోయాడు శివాజీ.

"న్యూజెర్సీ నుంచీ మీ యింటికి టూ హవర్స్ డ్రైవేనన్నావు గదా! నీ కొడుకు మీతో వుండడం లేదా?" అన్న సందేహాన్ని వెలిబుచ్చాడు వెంకట్.

"మెడిసన్‌లో చేరినప్పటి నుంచీ వాడు పార్టుటైం జాబ్ చేస్తున్నాడు. సిక్స్‌టీన్ యియర్సొచ్చాక యిక్కడి పిల్లలు పేరెంట్స్ పైన డిపెండ్ కారు. మా పిల్లలిద్దరూ లాస్టు ఫిఫ్టీన్ యియర్స్‌గా యిండిపెండెంటుగానే వుంటున్నారు" అన్నాడు శివాజీ.

"వొకసారి వాళ్ళిద్దర్నీ యింటికి రప్పించగూడదా? నేను గూడా చూసినట్టుండేది" అన్నాడు వెంకట్.

"మన పిల్లల ఫోటోలు వెంకట్‌కు చూపెట్టలేదా భవానీ?" అని వాకబు చేశాడు శివాజీ. ఆమె యెంతకూ సమాధానం చెప్పకపోయేసరికి మళ్ళీ తానే, "మా శ్యాంకు ట్వెంటీనైన్ యియర్సు. మా మోనీకి ట్వెంటీసెవను" అంటూ పూర్తిచేశాడు.

"అయితే వాళ్ళ పెళ్ళి సంగతి తల పెట్టలేదా?" అని అడిగాడు వెంకట్.

"వాళ్ళ పెళ్ళి వాళ్ళ ప్రైవేట్ అఫైరు. మనం కలగజేసుకుంటే వాళ్ళూరు కోరు" అంటూ సమాధానాన్ని కొనసాగించాడు శివాజీ. "మన చిన్నప్పుడు డ్రామాల్లో హరిశ్చెంద్రుడు 'వంశము నిలపనే గద వివాహంబు' అని పాడేవాడు గదా! యిక్కడా అంతే! పిల్లల్ని కందామనుకున్నప్పుడు, యిక తిరిగింది చాలు సెటిలవదామను కున్నప్పుడు వీళ్ళు పెళ్ళి గురించి ఆలోచిస్తారు. మిగిలిన అవసరాలకూ, పెళ్ళికీ లింకులేదు. కొందరు పెళ్ళి చేసుకోకుండానే పిల్లల్నీ గూడా కంటారు."

"కొందరు పిల్లలు పుట్టాక గూడా డైవోర్సు తీసుకుంటారు వెంకట్ గారూ! పెళ్ళెంత కామనో, డైవోర్సు గూడా అంతే కామన్ యిక్కడ." యీ సారి వివరణ

భవానీ దగ్గరి నుంచీ వచ్చింది.

"యిక్కడ మొగోళ్ళు మాదిరిగా ఆడోళ్ళు గూడా రెండు మూడు పెండ్లిండ్లు చేసుకుంటారని నేనూ విన్నాను లేమ్మా!" అంటూ బద్ధకంగా వొళ్ళు విరుచుకున్నాడు వెంకట్.

"అందులో తప్పేముందండీ?" అంది భవానీ నేరుగా వాగ్వివాదంలోకి దిగేస్తూ. "యిండియాలోలా యిక్కడ విమెన్‌కు వేరే 'లా' వుండదు. యిష్టం లేని హజ్బెండుకు సులభంగా డైవోర్సు చేయొచ్చు. యిండియా నుంచి వచ్చిన మొగవాళ్ళు టూ త్రీ యియర్సులో అమెరికనయిజైపోయి, యూరోపియన్ విమన్‌తో చెట్టపట్టాలేసుకుని తిరుగుతారు. మన విమెన్ మాత్రం అమెరికనైజ్ కాగూడదంటే అదేం న్యాయం? వాళ్ళు గూడా సమానంగా జాబ్‌చేసి యెర్న్ చేస్తున్నారా, లేదా?"

"వుద్యోగాలు చేయడంలో మాత్రమే గాదు, మన యిండియన్ విమెన్ మిగిలిన అన్ని విషయాల్లోనూ మగాళ్ళతో పోటీ పడుతున్నారులే!" యెడం చేత్తో స్టీరింగు తిప్పుతూ చెప్పుకుపోయాడు శివాజీ. " అంతా కెరీరిజం. దాని తర్వాతే యెవరైనా, యేదైనా!"

"రిటైరైన తర్వాతైనా యిండియాకొచ్చేస్తావా లేదా శివాజీ?" అంటూ చాలాసేపటి నుంచీ అడగదలచుకున్న సందేహాన్ని వెలిబుచ్చాడు వెంకట్.

"వచ్చేస్తాను. యిండియాకు వెళ్ళి సోషియల్ సర్వీసు చెయ్యాలని వుంది" అన్నాడు శివాజీ.

"నేను రాలేను. పిల్లలు మనల్ని పట్టించుకోకపోయినా, యిక్కడుంటే దగ్గరే వున్నార్లే అనే ఫీలింగయినా వుంటుంది" అంది భవానీ అడగని ప్రశ్నకు సమాధానం చెబుతున్నట్టుగా.

చాలా సేపటి వరకూ యెవరూ మాటాడలేదు.

"వచ్చేశాం. అవిగో కాసినోలు" అంటూ దూరం నుంచే చూపెట్టాడు శివాజీ.

పెద్ద పెద్ద భవన సముదాయాల మధ్యలో పరిగెట్టిన తర్వాత కారు, పెద్ద పార్కింగ్ ప్లేసు ముందుకెళ్ళింది. "నేను పార్క్ చేసి వస్తాను. మీరిక్కడే వుండండి" అన్నాడు శివాజీ. భవానీతో పాటూ వెంకట్ గూడా కిందికి దిగాడు. పార్కింగ్ కోసం స్థలాన్ని వెతుక్కుంటూ కారు లోపలికెళ్ళిపోయింది.

"లాస్ వేగాస్‌లో యింకా పెద్ద కాసినోలుంటాయి. నేనక్కడున్నన్ని రోజులూ వీకెండ్స్‌లో తప్పకుండా వెళ్ళేదాన్ని!" అంది భవానీ

వుద్వేగంతో యెగసిపడుతున్న ఆవిడ ముఖంకేసి ఆశ్చర్యంగా చూస్తూ "లాస్ వేగాస్‌లో యెప్పుడున్నారు?" అని అడిగాడు వెంకట్.

"నేనొక్కదాన్నే. శివాజీ యిక్కడే వుండేవాడు. నేనక్కడ సెవనియర్స్ జాబ్ చేశాను. అది బాగా పెద్ద ఆపర్ర్యూనిటీ. బలే యెంజాయ్ చేశాను" అందావిడ ముఖం ముడుచుకుంటూ.

శివాజీ తిరిగొచ్చాక ముగ్గురూ కలసి కాసినోలోకి నడచారు. వొక హాల్లోంచీ మరో హాల్లోకి నడుస్తూ రెండు మూడు ఫర్లాంగులు వెళ్ళారు. రంగురంగుల దీపాలతో భవనాలన్నీ లంబాడీ అమ్మాయిల అద్దాల పావడాల్లా చిత్రంగా కనిపిస్తున్నాయి. పెద్ద హాల్లో చిన్న చిన్న టేబుళ్ళ చుట్టూ విచిత్రమైన దుస్తులు తొడుక్కున్న స్త్రీలూ, పురుషులూ పేకముక్కలతో ఆడుకుంటున్నారు. యింకో హాల్లో పెద్ద లంగరు చక్రం చుట్టూ మనుషులు కేరింతలు కొడుతున్నారు. మరోహాల్లో టేబుళ్ళ ముందు వొయ్యారంగా నిల్చున్న స్త్రీలు కొందరు, ముందు నిల్చున్న పురుషుల్ని వూరిస్తున్నట్టుగా పేకముక్కలు పంచుతున్నారు. ట్రేలలో ఆహార పానీయాల్ని మోసుకొస్తున్న సాఖీల సంరంభం చెలరేగిపోతోంది.

"యీ కాసినో పేరు తాజ్‌మహల్. యిక్కడెక్కువగా ఆసియన్లే కనిపిస్తారు. నువ్వో కాసేపీ స్లాట్ మిషనుతో ఆడుకో. యీ స్లాట్‌లోకి కాయిన్ వేసి యీ స్విచ్ నొక్కితే నెంబర్లు రొటేటవుతాయి. యీ మేప్‌లో చూపెట్టిన పేటర్న్‌లో నెంబర్లు కలిస్తే ప్రైజు మనీ మిషను నుంచి డిస్చార్జ్ అవుతుంది. అటువైపు వాల్‌పైన పెద్ద లైఫ్ సైజు ఫోటలున్నాయి చూశావు గదా! అవన్నీ యీ గేమ్‌లో బాగా సంపాందించిన వాళ్ళ ఫోటోలు. నీ ఫోటో కూడా ఆ గోడపైకి యెక్కుతుందేమో చూద్దాం! నా ఫేవరేట్ గేమ్ బ్లాక్‌జాక్. భవానీకిష్టమైన గేమ్స్ ఆవైపు హాల్లో వున్నాయి.నేనూ అక్కడే వుంటాను. మన రిటర్న్‌జర్నీ నైట్‌కే! అందాకా నువ్వో యెంజాయ్ చెయ్యి" అంటూ పెద్ద ప్లాస్టిక్ గ్లాసు నిండా చిల్లర నాణాల్ని తీసుకొచ్చి వెంకట్ చేతికి యిచ్చాడు శివాజీ.

ఖాళీగా వున్న స్లాట్ మిషను ముందు కూర్చుని వెంకట్ ఆడుకోవడం మొదలుపెట్టాడు. తన దగ్గరున్న నాణాలు తరిగేకొద్దీ అతడిలో ఆడాలనే పంతమూ పెరగసాగింది. గెలిచిన నాణాలతో గ్లాసు నిండుతున్నప్పుడల్లా మరి కాసేపు ఆడాలనే కోరికా యినుమడించసాగింది. గెలుపూ వోటములు రెండూ వొకే రకమైన వుత్కంఠనే పెంచడంతో అతను పూర్తిగా లోకాన్ని మరచిపోయి ఆడసాగాడు.

చాలా సేపటి తర్వాత శివాజీ వచ్చి, "బాగానే విన్నయ్యావే" అన్నప్పుడు గానీ అతను తల తిప్పలేదు. "యెక్కడ గెలిచాను? మొత్తానికి యింకా పది డాలర్ల లాస్‌లోనే నడస్తా వుంది బండి" అని నీరసంగా నవ్వాడు వెంకట్.

"లంచ్ యేదైనా తినొద్దాం పద, తర్వాత గెలుద్దవుగానీ" అన్నాడు శివాజీ.

కాసినో వెనుక వైపు దారి నుంచీ బయటి కొచ్చారిద్దరూ. యెదురుగా నీలిరంగు సముద్రం రొద చేస్తూ కనిపించింది. రోడ్డు పక్కన వరుసగా కాసినోల ద్వారాలు నోళ్ళు తెరుచుకున్న తిమింగలాల్లా కనిపిస్తున్నాయి. సముద్రతీరం వెంటచాలామంది అటూ యిటూ పరతెంచిపోతున్నారు. దారి పక్కన రకరకాల తినుబండారాల అంగళ్ళు మనుషుల్ని కవ్విస్తున్నాయి.

హోటలుకెళ్ళాక పిజ్జాలతో బాటూ స్కాచ్ ఆర్డరిచ్చాడు శివాజీ. చుట్టూ మరోసారి కలయజూశాక, "యిక్కడెందుకో అందరూ ముసిలోళ్ళే కనిపిస్తా వుండారు" అని చెప్పాడు వెంకట్.

"యీ కాసినోలకొచ్చే వాళ్ళలో మెజారిటీ రిటైరైపోయిన వాళ్ళదే. వాళ్ళ చిల్డ్రన్ యెక్కడుంటారో గూడా యీ వోల్డు పీపులుకు తెలియదు. చేతినిండా డాలర్లుంటాయి గానీ వర్కు చేసే శక్తి వుండదు. యిక్కడ ఫుడ్డుతో బాటు యెంటర్‌టైన్‌మెంటు కూడా దొరుకుతుంది. కొందరైతే మన్త్స టుగెదర్ యిక్కడే గడిపేస్తారు" అన్నాడు శివాజీ.

హోటల్లో నుంచీ తిరిగొస్తున్నప్పుడు యెదురైన ముసలి దంపతులను తేరిపార చూస్తూ "యింకో పద్దైదిరవై యేండ్ల తర్వాత మీరిద్దరూ గూడా యిక్కణ్ణే యీ మాదిరిగానే జాలీగా తిరగతా వుంటారేమో గదా!" అన్నాడు వెంకట్ తన మిత్రుడికేసి పరకాయించి చూస్తూ.

అతని మాటల్ని వినిపించుకోకుండా, "భవానీ మాదిరిగా మనం గూడా కాసినోలోనే యేదైనా తినేసుంటే టైం వేస్టయి వుండదు. నీకే సీసైడ్ చూపించడం కోసమని యిలా బయల్దేరదీశాను" అని చెబుతూ హడావుడిగా కాసినోలోకి దూసుకుపోసాగాడు శివాజీ.

మరో పదిహేను నిమిషాల్లో వెంకట్ గూడా తన యంత్రంతో ఆడుకోడంలో మునిగి పోయాడు. పగలునూ, రాత్రినీ వేరుచేసి చూపుతున్న సూర్యుణ్ణి యెగతాళి చేస్తున్నట్టుగా, కాసినోల్లో కాలచక్రం పూర్తిగా ఆగిపోయినట్టు కనిపిస్తోంది. బాగా వడలిపోయిన కూరగాయల్ని తలపించే ముఖాలతో కొందరు, కాసినోలలోనే పుట్టి, అక్కడే పెరిగి అక్కడే ముసలివాళ్ళయి పోయిన వ్యక్తుల్లా

చిత్రంగా కనిపిస్తున్నారు. మరి కొందరు యెదుట కూర్చున్న వ్యక్తుల్ని గూడా యంత్రాలుగానే భావిస్తున్నట్టుగా నిర్వేదంగా కనిపిస్తున్నారు. వొంటరిగా యంత్రాలతో ఆడుకుంటున్న మనుషులు కొందరు, వాటినే మనుషులనుకున్నట్టుగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు.

తన దగ్గరున్న నాణాలన్నీ ఖాళీ అయిపోయిన తర్వాత వెంకట్ నిరుత్సాహంగా మిత్రుడి దగ్గరికెళ్ళాడు. శివాజీ మరో గ్లాసు నాణాల్ని సమకూర్చాడు. రెండో విడత నాణాలతో వెంకట్ లాటరీ యంత్రాన్ని మళ్ళీ ముగ్గులోకి దించేశాడు. స్లాట్‌లోంచీ జారుతున్న నాణాల కంటే వేగంగా కాలం దొర్లుకుపోసాగింది.

"యిక వెళ్దామా?" అని భవానీ వచ్చి హెచ్చరించే వరకూ వెంకట్ స్లాట్ మిషన్‌తో డాలర్ల భాష మాట్లాడుతూనే వున్నాడు. భవానీ మరోసారి పిలిచిన తర్వాత యంత్రాన్ని విడవలేక విడుస్తూ, గ్లాసులో మిగిలిన నాణాల్ని లెక్క పెట్టుకోసాగాడు. కాసినో బయటికొచ్చిన తర్వాత "యిక్కడే వుండండి. కారు తీసుకొస్తాను" అంది భవానీ. పార్కింగ్ వైపుకు వొంటరిగా వెళ్ళిపోయింది ఆమె.

అయిదు నిమిషాల తర్వాత, కారు వేగంగా వచ్చి అతని ముందాగింది.

భవానీ స్టీరింగు ముందు కూర్చుని వుంది. శివాజీ వెనక సీట్లో జోగుతున్నాడు. తానూ వెనక సీట్లో కూర్చున్నాడు వెంకట్. కారు బయలుదేరింది.

కాసేపటి తర్వాత, "మీకు ఆకలిగా లేదా" అని ప్రశ్నించింది భవాని.

చేతి గడియారాన్ని వాకబు చేసిన తర్వాత, "తొమ్మిది అయిపోయింది. నేను గమనించనే లేదు" అన్నాడు వెంకట్.

"నో నీడ్ టు వర్రీ! టుమారో మార్నింగ్ యెయిట్‌కు గదా మీ ఫ్లయిట్. శివాజీకి లీవు దొరకలేదు. యెయిర్‌పోర్టుకు నేనే రావాలి. మీరు మార్నింగ్ సిక్స్‌కంతా రెడీగా వుండండి. చెకింగ్‌కు చాలా టైం తీసుకుంటున్నారీ మధ్య" అందామె.

"శివాజీ, శివాజీ" అంటూ మిత్రుణ్ణి గట్టిగా కుదిపాడు వెంకట్.

"యిక లాభం లేదు. అతను మన లోకంలో లేడు" అంది భవాని. రెండు నిమిషాల తర్వాత, "బ్లాక్ జాక్‌లో కూర్చున్నప్పుడు హెవీగా డ్రింక్ తీసుకోవడం అనేది శివాజీకి బాగా అలవాటైపోయింది. యిక డిన్నర్ గూడా తినడు. యిది

మాకు అలవాటే" అంది ఆవిడ నింపాదిగా.

చాలాసేపు ఆలోచించిన తర్వాత మాటలు కూడబలుక్కున్నట్టుగా, "మీ యింట్లో టేపు రికార్డరుండాదా?" అని అడిగాడు వెంకట్.

ఆవిడ అదోలా తల వూపింది.

"శివాజీ పాట వినాలన్నాడు. మొన్నటి నుంచీ వినిపించాలని యెదురు చూస్తా వుండాను. టైం దొరకలేదు. టేపయినా చేసిద్దామని..." అర్థోక్తిలో ఆగిపోయాడు అతను.

"శివాజీనా? పాట వినడమా!" మంద్రమూ, తారస్థాయీ రెండూ తెలియని యాంత్రిక ధోరణిలో ప్రశ్నించింది భవాని.

"పాత టేపురికార్డరూ, టేపులూ యింట్లో దుమ్ముగొట్టుకుపోయాయి. వారానికొకసారి నేను క్లీన్ చేయకపోతే సీడీ ప్లేయర్ గూడా రస్టుగొట్టుకుపోతుంది. యెప్పుడూ స్టాక్ మార్కెట్ న్యూస్ వింటూ అజిటేటయిపోతున్నాడని అతని కారులోని రేడియోని గూడా పీకించేశాను. శివాజీ యేమిటి? కుదురుగా కూర్చుని పాటలు వినడమేమిటి? యిదేదో యెయిత్ వండర్‌లాగుందే నాకు! యింతకూ యేం పాట అది? వోకలా? యిన్‌స్ట్రుమెంటలా? క్లాసికలా? ఫోకా? తెలుగా? యింగ్లీషా? పాడిందెవరు?"

సమాధానం చెప్పడం కోసం వెంకట్ నోరు తెరిచాడు. కానీ, గొంతుకలో యేదో అడ్డం పడినట్టుగా మాటలు మాత్రం అతని పెదవుల నుంచీ వెలువడలేదు.

*(31 డిసెంబర్ 2002 యిండియాటుడే)*

❖ ❖ ❖